క్లుప్తంగా

నేడు ప్రారంభోత్సవాలు

టి.నరసాపురం: మండలంలో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను సోమవారం ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభిస్తారని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నిర్మాణాలు పూర్తయిన తెడ్లం సచివాలయం, గుడ్లపల్లి సొసైటీ మల్టీపర్పస్ గోదాం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, టి.నరసాపురంలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్‌లను వారు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ వర్గాలు పాల్గొనాలని కోరారు.

విశ్వ బ్రాహ్మణులు అభివృద్ధి చెందాలి



పాల్గొన్న విశ్వ బ్రాహ్మణులు

చింతలపూడి: అన్ని రంగాల్లో విశ్వ బ్రాహ్మణులు అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత ఉందని విశ్వ బ్రాహ్మణ సంఘం మండల నాయకుడు బెజ్జంకి నాగు అన్నారు. మండల విశ్వ బ్రాహ్మణ సంఘ సమావేశం ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించారు. భవిష్యత్తులో విశ్వ బ్రహ్మణుల సంక్షేమానికి కట్టుబడి పని చేయాలని సమావేశంలో నాయకులు తీర్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాదా ప్రసాద్, మొగడా చెన్నకేశవాచారి, గిరిజాల చంద్రశేఖర్, బండికట్ల శ్రీనివాస్, కానూరి వెంకటాచారి, దెంచినాల చారి, పోలోజు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ సేవలో మేయర్ నూర్జహాన్



నూకాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని నూకాలమ్మవారి ఆలయంలో అమ్మవారిని నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. అమ్మవారి కరుణాకటాక్ష వీక్షణాలు నగర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు మేయర్ నూర్జహాన్‌కు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి కృష్ణ, వెల్లంకి రాజు, జనపరెడ్డి కృష్ణ, గొంతిన రామకృష్ణ, బావిశెట్టి కేశవ, నక్కా నాగేశ్వర రావు, తనకాల లక్ష్మాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదుర్గ పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరే రామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దుర్గాసప్తశతి బృందం ప్రతినిధులు అమ్మవారి ఆవాహన అష్టోత్తర సహస్రనామ పూజలు, నవదుర్గ పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు, తిరిగి సాయంత్రం 5 గంటలకు 310 మంది మహిళలు పాల్గొనగా, లలితా సహస్రనామ కుంకుమార్చన ఐదేసి సార్లు నిర్వహించారు. రాత్రి స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నగర కమిటీ, నగర అనుబంధ కమిటీల్లో పలువురు నేతలకు పదవులు కేటాయిస్తున్నట్టు పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో వీరంతా పనిచేస్తారని చెప్పారు. పార్టీ ఏలూరు నగర సెక్రటరీలుగా బొడ్డేటి సుబ్బారావు, సవలవరపు నారాయణరావు, మైనార్టీ సెల్ ఏలూరు నగర సెక్రటరీగా షేక్ ఖాదర్ బాబా, బీసీ సెల్ ఏలూరు నగర సెక్రటరీగా కేజీవీఎస్ పుండరీకాక్షుడు నియమితులైనట్టు చెప్పారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

30 ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

- తిమ్మాపురం ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం
- జగనన్న పాలనలో తీరిన తాగునీటి సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోంది. ఏళ్ల నాటి సమస్యలను పరిష్కరిస్తూ, ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదని దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాల నోటికి తాళాలు వేస్తోంది. ఈ క్రమంలోనే ద్వారకాతిరుమల మండలంలోని తిమ్మాపురం ఎస్సీ కాలనీలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.44.47 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్‌ను నిర్మించి, 30 ఏళ్లుగా తిష్టవేసిన తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించింది. దాంతో ఆ ప్రాంత వాసుల ఆనందానికి అవధులు లేవు. ఇదిలా ఉంటే ఈ ఓహెచ్ఎస్ఆర్‌ను రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత శనివారం రాత్రి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని నెత్తీనోరూ కొట్టుకునేదీ ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు మాత్రమేనన్నారు. జగనన్న పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటున్నారని అన్నారు. 30 ఏళ్ల నాటి తాగునీటి సమస్యకు తమ ప్రభుత్వం చెక్ పెట్టిందని చెప్పారు. ప్రజలు టీడీపీని నమ్మే రోజులు పోయాయని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. జగనన్న ఓట్లు కోసం రాజకీయాలు చేయడం లేదని, ప్రజా సమస్యలు తీర్చేలా పాలన సాగిస్తున్నారని అన్నారు. సామాజిక సమతుల్యతను పాటించడంలో తమ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, గ్రామ సర్పంచ్ ఎర్రగొల్ల రజని, బోళ్ల శ్రీను, ఆచంట బన్ను, కొత్తపల్లి వెంకన్న, రాయుడు, ఘంటా శేఖర్, మురుగుల దుర్గారావు, నల్లంటి రామారావు, తవిటికూటి ఏసురత్నం, నల్లంటి నాగ మణీంద్రరావు, పెండ్లి గాంధీ, ముళ్లపూడి నాగరాజు, ఎడ్లపల్లి రమేష్, పెండ్లి వీరబ్రహ్మం, మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, జంగా వెంకట కృష్ణారెడ్డి, గుర్రాల లక్ష్మణ్, బొండాడ వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తప్పాయి



కాలనీలో ఓహెచ్ఎస్ఆర్ నిర్మించడం వల్ల 300లకు పైగా ఇళ్లకు తాగునీరు అందుతోంది. నిన్నమొన్నటి వరకు చుక్క నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. పాలకులు మా సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు.

– కొత్తపల్లి శాంతి, తిమ్మాపురం

గత ప్రభుత్వాలను ప్రాధేయపడ్డాం



కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించాలని గత ప్రభుత్వాలను ప్రాధేయపడ్డాం. 30 ఏళ్లుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. ఎన్నికల సమయంలో మా సమస్యను పరిష్కరిస్తామని అందరూ చెప్పేవారు. కానీ ఆ తరువాత పట్టించుకునేవారు కాదు. కానీ జగనన్న ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడింది.

– ఎడ్లపల్లి మారెమ్మ, తిమ్మాపురం

నేడు తెల్లం రాజ్యలక్ష్మి కొయ్యలగూడెం పర్యటన

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే బాలరాజు సతీమణి తెల్లం రాజ్యలక్ష్మి సోమవారం కొయ్యలగూడెం పర్యటించనున్నట్లు సచివాలయాల మండల కన్వీనర్ నూకల రాము తెలిపారు. పార్టీ ఆధ్వర్యాన జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారని, ఉదయం 9 గంటలకు గణేష్ సెంటర్లో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: 33/11 కేవీ టి.నరసాపురం సబ్ స్టేషన్ పరిధిలో రోడ్ క్రాసింగ్ పనులు నిర్వహిస్తున్నందున సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకుందాం



లింగపాలెంలో వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన కె.విజయరాజు

లింగపాలెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారమే లక్ష్యంగా, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. లింగపాలెంలో బీవీఎస్ రెడ్డిని తన గెస్ట్‌హౌస్‌లో ఆదివారం విజయరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అందించిన సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామ రక్ష అన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. అటువంటి నాయకుడ్ని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలు మున్ముందు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, లింగపాలెం సొసైటీ చైర్మన్ బి.సోమిరెడ్డి, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు కొఠారి మోహన్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు, కె.రమేష్, డి.రవీంద్ర, నాయకులు ఇనుంగంటి సతీష్, రావి కొండయ్య, మందలపు నరిశింహరావు, బి.ప్రభాకరెడ్డి, కర్లపూడి ఆనంద్, నూతలపాటి శ్రీను, శావా రాజేష్, షేక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



జంగారెడ్డిగూడెం నోవా ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 13 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల, శ్రీరామచంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్, జెడ్పీహెచ్ బాలుర హైస్కూల్, ఉప్పలమెట్ట గురుకుల పాఠశాల, శ్రీచైతన్య స్కూల్, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, విద్యావికాస్ పాఠశాల, మండలంలోని వేగవరం నోవా ఇంజినీరింగ్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, ఫార్మసీ కాలేజ్, లక్కవరం జెడ్పీ హైస్కూల్, బుట్టాయగూడెం జూనియర్ కాలేజ్‌లలో పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు గ్రూప్-2 పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు తాగునీటి వసతి, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆర్డీవో కె.అద్దయ్య నోవా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 13 సెంటర్లలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు.

కుట్టు శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: కుట్టు శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ఆదివారం సీఎస్ఐ సంఘం కొండగూడెం ప్యారిస్ ఆధ్వర్యాన నిర్వహించే కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి సీఎస్ఐ కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతులు డాక్టర్ టి.జార్జ్ కొర్నేలియాస్, అధ్యక్ష ఖండ స్త్రీల మైత్రి అధ్యక్షురాలు టి.జాషుకుమారి ముఖ్యఅతిథులుగా హాజరై స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారు కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో సీఎస్ఐ సంస్థ ఆధ్వర్యాన ఈ శిక్షణా కేంద్రాన్ని నిర్వహించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, పాస్టర్లు జాన్ రాజు, మానుకొండ దేవ స్తుతుడు, లేటు రంజిత్ కుమార్, జాన్ కిరణ్ కుమార్, కరుణానిధి, పండు ప్రసన్న, మహిళలు పాల్గొన్నారు.

4న జరిగే సమావేశాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి క్రిష్ణ

కుక్కునూరు: వచ్చేనెల 4వ తేదీన బుట్టాయగూడెం మండల కేంద్రంలో జరిగే సీపీఐ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పార్టీ నాయకుల సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇండియా కూటమి పోరాడుతుందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం కారణంగానే మరలా రైతులు దేశ రాజధానిలో నిరాహార దీక్షలు, ధర్నాలు చేపడతున్నారన్నారు. వీరికి సీపీఐ, ఇండియా కూటమి మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. బుట్టాయగూడెంలో జరిగే సమావేశాలకు పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, అయితా సురేష్, వర్కా శ్యామల. కురాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించండి



చొప్పరామన్నగూడెంలో మరమ్మతులకు గురైన మోటార్ బోరు

కొయ్యలగూడెం: లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. కొయ్యలగూడెం, పరింపూడి, గవరవరం, చొప్ప రామన్నగూడెం పరిధిలో లోవోల్టేజ్ సమస్య వల్ల ఉపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలుగుతుందని మాజీ సర్పంచ్ తెలిపారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్, శ్రీరామ్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో లోవోల్టేజ్ సమస్య వల్ల గృహోపకరణాలు మరమ్మతులకు గురయ్యాయని, అదేవిధంగా ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన బోర్లు ఓల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్య వల్ల రిపేరుకు గురయ్యాయని సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వీరభద్ర స్వామి రథోత్సవం



వీరభద్ర స్వామి రథోత్సవం

కామవరపుకోట: వీరభద్ర స్వామి కళ్యాణోత్సవంలో భాగంగా శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన ఆదివారం స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం చౌతన సెంటర్‌లో స్వామివారి త్రిశూల స్నానం, వసంతోత్సవం అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని ముందుకు లాగారు. కామవరపుకోట పురవీధుల్లో రథం ముందు అర్చకుల మంత్రోత్సవాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, డీజే శబ్దాలతో, విజయనగరం బృందంచే సినీకోలాటం చూపారులను కనువిందు చేసింది, గుంటూరు వారిచే కర్ణాటక మహిళా డోలు విన్యాస ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. విజయవాడ వారిచే బేతాళ శెట్టు విచిత్ర వేషాలతో చౌతన సెంటర్ నుంచి దుర్గామహల్ మీదుగా గుర్రాల చెరువు వరకు తడికలపూడి ఎస్సై జయబాబు ఆధ్వర్యాన భారీ బందోబస్తు మధ్య ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ రథోత్సవం సాగింది.

ముగిసిన స్వరాంజలి కార్యక్రమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల, హైదరాబాద్‌కు చెందిన గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా శనివారం ప్రారంభమైన స్వరాంజలి కార్యక్రమం ఆదివారం ముగిసింది. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో రెండో కార్యక్రమంలో పలువురు గాయకులు సుమారు 100 పాటలను ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు రేవతి రామ్‌కుమార్, లంకా వెంకటేశ్వర్లు, మనస్విని, టి.సాయి కుమార్, వి.రాజేష్ మీనన్, సీహెచ్ కల్యాణ్, డి.నరేష్ తదితర గాయకులు ఘంటసాల పాటలను శ్రావ్యంగా ఆలపించారు. గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ అధినేత టి.గోవిందరావు సంగీత సారథ్యంలో వి.రామ్‌కుమార్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలూరులో పొట్టి శ్రీరాములు పార్క్

- ఇడా నిధులు రూ.12 లక్షలతో పార్క్ అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



పొట్టి శ్రీరాములు పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు పార్కును ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.12 లక్షలతో సుందరంగా ఆకర్షణీయంగా అభివృద్ధి చేశారు. దీనిని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చేతులమీదుగా ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే నాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఏలూరు నగరంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, నగర ప్రజల వందలాదిగా తరలివచ్చారు. అనేక ఏళ్లుగా ఉన్న తమ కోరికను నెరవేర్చిన ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాములు ఆశయాలు స్ఫూర్తి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను సైతం బలిగా అర్పించిన మహనీయులు, త్యాగశీలి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. తెలుగు ప్రజలంతా ఒకే ప్రాంతంలో జీవించాలనే గొప్ప ఆకాంక్షతో ఆమరణ దీక్ష చేసి రాష్ట్ర ఏర్పాటుకు తన ప్రాణాలను సైతం త్యజించేందుకు సిద్ధపడిన శ్రీరాములును స్ఫూర్తిగా తీసుకుని జాతి సమైఖ్యతకు కృషి చేయాలని కోరారు. ఏలూరు అర్బన్ జిల్లా అధ్యక్షుడు చలువది బ్రహ్మయ్య మాట్లాడుతూ అడిగిన వెంటనే పొట్టి శ్రీరాములు పార్కును అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే నానికి ఆర్యవైశ్య సంఘం తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సంఘ కార్యదర్శి మోటమర్రి సదానందం మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల పట్ల సానుకూల దృక్పథంతో తమకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నానిని అభినందించారు. ఆర్యవైశ్య నాయకులు మద్దుల సత్యకుమార్, తడికిమల్ల సుబ్బారావు, వాసవి సుబ్బారావు, చక్క రాజా మాట్లాడుతూ ఏలూరులో గత ఐదేళ్లుగా ఆర్యవైశ్యులు అడిగిన ప్రతి పనినీ పూర్తి చేయటం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక మంది ఆర్యవైశ్యులకు ఇళ్ల పట్టాలు అందాయనీ, మొట్టమొదటి సారిగా పేద మహిళలకు ఈబీసీ నేస్తం పథకం ద్వారా లబ్ధి చేకూరిందని తెలిపారు. కార్యక్రమంలో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఇడా వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఆర్యవైశ్య ప్రముఖులు నేరెళ్ల రాజేంద్ర, గోల్డ్ మర్చంట్స్ ప్రెసిడెంట్ తమ్మన మధు, పైడేటి రామారావు, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న శ్రీను, యువజన అధ్యక్షులు బొలిశెట్టి సురేష్‌కుమార్, సేవాదళ్ అధ్యక్షులు దిలీప్, కోఆప్షన్ సభ్యులు గుడివాడ రామచంద్రకిషోర్, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు, ఆర్యవైశ్యులు ఉన్నారు.

ఓపెన్ పరీక్షలు కుక్కునూరులో నిర్వహించాలి

కుక్కునూరు: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల సెంటర్‌ను కుక్కునూరు మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ కోరారు. ఆదివారం సుందరయ్య భవన్, ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యాన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులో ఓపెన్ పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థులు 75 కిలో మీటర్ల దూరంలో ఉన్న జంగారెడ్డిగూడెం వెళ్లేవారని పేర్కొన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం కుక్కునూరులో సెంటర్ నిర్వహణకు అనుమతి ఇచ్చిందన్నారు. కాగా పరీక్షా కేంద్రాన్ని జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థులు అక్కడికి వెళ్లి రావడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. విద్యార్థులందరి ఆర్థిక పరిస్థితి ఒకేవిధంగా ఉండదు కనుక కుక్కునూరులోనే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

వైభవంగా జాతర



ప్రత్యేక పూజలు చేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరంలో కొలువై ఉన్న దుర్గమ్మతల్లి, గుబ్బల మంగమ్మతల్లి, గద్దెరాజుల జాతర మహోత్సవాలు రెండో రోజు ఆదివారం వైభవంగా జరిగాయి. దుర్గమ్మ, మంగమ్మ, గద్దెరాజులకు గిరిజన సాంప్రదాయ నృత్యాలతో ఆలయ పూజారి వర్స పుల్లారావు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామవరం, పందిరిమామిడిగూడెం, వేపులపాడు, బూరుగువాడతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో జాతరలో పాల్గొన్నారు. అదేవిధంగా కామవరం గుడి నుంచి గుబ్బల మంగమ్మ గుడి వరకు డోలు మేళవాయిద్యాలతో గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన



ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

కొయ్యలగూడెం: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యాన స్థానిక గణేష్ సెంటర్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగ సమర్పణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుందో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.విజయ్‌కుమారి పంచాయతీ వార్డు సభ్యులు రాచూరి మదన్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జి కాంతారావుకు పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ చిత్రకళాకారుడు మజ్జి కాంతారావును మానవత ప్రతిభా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. మానవత సంస్థ ఏలూరు యూనిట్ నెలవారీ సమావేశం ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. చిత్రకళ రంగానికి కాంతారావు చేసిన సేవలు విశేషమైనవని, తనదైన శైలిలో విభిన్న చిత్రాలను చిత్రీకరించి నగరానికి రాష్ట్ర స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావడంలో కృషి చేస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. కాంతారావు తన తల్లితండ్రులు పేరున మానవత జిల్లా విద్యానిధికి రూ.25 వేల చెక్కును చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్పై పీవీవీ రమణ మానవత సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు దేవినేని భాస్కరరావు, పోలవరపు దేవరత్నాకరరావు, అడుసుమిల్లి నిర్మల, కడియాల కృష్ణారావు, మానేపల్లి సత్యనారాయణ, వాసిరెడ్డి శేషగిరిరావు, వల్లూరుపల్లి సాయి సుధ తదితరులు పాల్గొన్నారు.